# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 2, మే 2026


### శుద్ధవాగులో మునిగి

## ఇద్దరు బాలురు మృతి

**నర్సాపూర్(జి), 01 మే, ప్రభాతవార్త:**

నర్సాపూర్(జి) మండల కేంద్రంలో శుక్రవారం తీవ్ర విషాదం నెలకొంది. శుద్ధ వాగులో ఈతకు వెళ్లిన ఇద్దరు బాలురు నీటిలో మునిగి మృతి చెందారు. స్థానిక సమాచారం ప్రకారం.. నర్సాపూర్ మండలానికి చెందిన రిజ్వాన్, అశు అనే ఇద్దరు బాలురు మధ్యాహ్నం సరదాగా ఈత కొట్టడానికి సమీపంలోని శుద్ధ వాగు వద్దకు వెళ్లారు. అయితే, నీటి లోతును అంచనా వేయలేక వారు వాగులో మునిగిపోయారు. పిల్లలు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వాగు వద్ద గాలించగా, అప్పటికే వారు మృతి చెంది కనిపించారు. ఒకేసారి ఇద్దరు చిన్నారులు మరణించడంతో నర్సాపూర్ మండల కేంద్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తమ పిల్లలను పోగొట్టుకున్న తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.







### కార్మిక నాయకుడు జెట్టి శంకర్‌రావుకు

## రాష్ట్ర ప్రభుత్వ శ్రమ శక్తి అవార్డు

✪ నాలుగు దశాబ్దాల నిస్వార్థ సేవలకు గుర్తింపుగా పురస్కారం

**నస్పూర్, మే 1, ప్రభాతవార్త**

సింగరేణి కార్మికులకు నాలుగు దశాబ్దాలుగా నిస్వార్థ సేవలు అందిస్తున్న ఐఎన్టీయూసీ నాయకుడు జెట్టి శంకర్ రావు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక శ్రమ శక్తి అవార్డు అందుకున్నారు. మే డే వేడుకల్లో భాగంగా శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ సిఫారసు మేరకు ప్రభుత్వం ఈ అవార్డును అందజేసింది. బెల్లంపల్లిలో జన్మించిన జెట్టి శంకర్ రావు 1985లో సింగరేణి సంస్థలో ట్రేడ్స్‌మెన్‌గా తన వృత్తిని ప్రారంభించారు. విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు కలిగిన ఆయన ఎన్ఎస్‌యూఐ ద్వారా ప్రజా జీవితంలోకి వచ్చారు. ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి. సంజీవ రెడ్డి మార్గదర్శకత్వంలో కార్మిక సంఘంలో చేరిన మిగతా 2లో..

### కార్మిక సంక్షేమమే ధ్యేయంగా

## ప్రభుత్వ పథకాల అమలు

✻ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, మే 1, ప్రభాతవార్త**

కార్మిక సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మే డే వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ దుర్గం క్రాంతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కార్మికుల సంక్షేమంలో భాగంగా మే డేను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్మికుల దినోత్సవం ప్రతి కార్మికుడు గర్వపడవలసిన రోజు అని, జిల్లాలోని అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ప్రమాద రీత్యా మరణించిన 102 కార్మికుల కుటుంబాలకు సుమారు 60 కోట్ల రూపాయలు, సహజ మరణం పొందిన 223 కార్మికుల కుటుంబాలకు సుమారు 24 కోట్ల రూపాయలు, పెళ్లి ప్రోత్సాహం కింద 993 మందికి సుమారు 30 కోట్ల రూపాయలు, ప్రసూతి ప్రోత్సాహం కింద 1 వేయి 646 మందికి సుమారు 49 కోట్ల రూపాయలు, దివ్యాంగత్వం పొందిన వారికి సుమారు 68 కోట్ల రూపాయలు అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 2వ తేదీ నుండి 10వ తేదీ వరకు మే డే వార్షికోత్సవంలో భాగంగా కార్మిక శాఖ ఆధ్వర్యంలో మిగతా 2లో..

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్ భవేశ మిశ్రా

**దిలావర్పూర్, మే 01, ప్రభాతవార్త:**

లబ్ధిదారులు తమకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శుక్రవారం దిలావర్పూర్ మండలం సిర్గాపూర్ గ్రామంలో మోనిక అనే లబ్ధిదారుకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలు, ఖర్చు, ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల గురించి లబ్ధిదారులను అడిగి మిగతా 2లో..



## కాగజ్‌నగర్‌లో 700 దేశీ దారు బాటిళ్ల స్వాధీనం

✦ ఇద్దరు అరెస్ట్ ✦ అక్రమ మద్యం రవాణా, విక్రయాలపై చట్టపరమైన చర్యలు

✦ కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి

**కాగజ్‌నగర్ రూరల్,మే 1, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ ప్రాంతంలో అక్రమ మద్యం రవాణాపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి, ఎస్సై సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీలలో భాగంగా 700 దేశీ దారు బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. డాదానగర్ గ్రామంలోని పోచమ్మ గుడి సమీపంలో శుక్రవారం సిర్పూర్(టి) నుండి కాగజ్‌నగర్ వైపు వస్తున్న (ఎంహెచ్34సీజి4729) నంబర్ గల టీవీఎస్ స్కూటీ అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు ఆపి తనిఖీ చేశారు. వాహనంలోని వ్యక్తులు సరైన పత్రాలు చూపించలేకపోవడంతో వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించగా మూడు ప్లాస్టిక్ సంచుల్లో మొత్తం 700 రాకెట్ దేశీ దారు" (ప్రతి ఒక్కటి 90 మి.లీ.) బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం మిగతా 2లో..





## ఉపాధి హామీ పనులను పరిశీలించిన కలెక్టర్

**సిర్పూర్ (టి) మే 1, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో శుక్రవారం రోజున ఉపాధి హామీ పనులను జిల్లా కలెక్టర్ కె హరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఉపాధి హామీకూలీలతో మాట్లాడుతూ ఉదయం పూట పనులకు త్వరగా రావాలని ఎండలు బాగా ఉన్నందున పని త్వరగా ముగించుకొని వెళ్లాలని తెలిపారు. మే డే సందర్భంగా ఉపాధి హామీ కూలీలను శాలువాతో సన్మానించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ దత్తారావు ఎంపీడీవో సత్యనారాయణ ఎంపీ ఓ వినోద్ కుమార్ సర్పంచ్ వడ్డేటి నాగమణి ఏపీవో చంద్రయ్య ఏపీఎంమహేష్ సెక్రెటరీ తిరుపతి వార్డు సభ్యులు సుజాత మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### కార్మిక సంక్షేమమే ధ్యేయంగా

# ప్రభుత్వ పథకాల అమలు

**(మొదటిపేజీ తరువాయి)**

జిల్లాలోని కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బాల కార్మికులకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం జరుగుతుందని, నైపుణ్యం లేని కార్మికుల నైపుణ్యం పెంపొందించేందుకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు, పారిశ్రామిక శిక్షణ సంస్థల ద్వారా నైపుణ్యాలను మెరుగుపరచడం జరుగుతుందని తెలిపారు.

మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని కార్మికుల భద్రత, హక్కులను కాపాడడం కోసము ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో త్వరలోనే ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు అయ్యేలా కృషి చేయడం జరుగుతుందని, అసంఘటిత కార్మికులు చనిపోతే వారి కుటుంబానికి ఇచ్చే నగదును 15 లక్షల రూపాయలకు పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ద్వారా సింగరేణిలోని ఒప్పంద కార్మికులకు 5 వేల రూపాయల బోనస్ ఇవ్వడం జరిగిందని, 2 లక్షల 50 వేల రూపాయల లోపు ఆదాయం ఉన్న సింగరేణి రిటైర్డ్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆహార భద్రత, విద్య ప్రతి ఒక్కరికి అందేలా ప్రభుత్వ పథకాలు రూపొందించడం జరిగిందని, ప్రభుత్వం కార్మికులకు, రైతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.

అనంతరం కార్మిక శాఖకు చెందిన బి.సత్యనారాయణ, ఉపాధి కల్పన క్రింద వై. రమేష్ (ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్) , ఉత్తమ ఎస్టాబ్లిష్మెంట్ క్రింద ఓరియంట్ సిమెంట్ దేవాపూర్, ప్రత్యేక కేటగిరీ (బాల కార్మిక) క్రింద శివాజీ (7 తరగతి విద్యార్థి, జడ్.పి.హెచ్.ఎస్. టేకుల బస్తి, బెల్లంపల్లి) లకు అవార్డులు అందజేశారు. తదనంతరం జిల్లాలోని 16 మండలాలకు ఏంఎన్ఆర్ఇజిఎస్ పనుల కోసం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మంజూరు చేసిన కంప్యూటర్లను మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### షార్ట్ సర్క్యూట్‌తో

## మామిడి తోట దగ్ధం

**తాండూర్, మే 1, ప్రభాతవార్త :**

తాండూర్ మండలం చౌటపల్లి గ్రామ శివారులో శుక్రవారం మామిడి తోటలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. తాండూర్ కు చెందిన ఎండి ఈసాకు సర్వేనెంబర్ 110/1లో రెండు ఎకరాల మామిడి తోట ఉంది. విద్యుత్ సోలార్ ప్లాంట్ కరెంట్ సరఫరా చేసే లైన్ వద్ద షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పులు చెలరేగి మామిడి తోటలో పడ్డాయి. దీంతో తోటలోని దాదాపు 200 మామిడి చెట్లు, 145 టేకు చెట్లకు మంటలు వ్యాపించి దగ్ధమయ్యాయి. అగ్ని ప్రమాదం వలన మామిడి తోటలో గల మామిడి కాయలు, టేకు చెట్లు దగ్ధం కావడం వలన లక్షలలో ఆస్తి నష్టం జరిగిందని రైతు ఈసా ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు.

### నర్సరీ సంరక్షణపై

## ప్రత్యేక దృష్టి పెట్టాలి

**- ఏపీవో దివ్యారెడ్డి**

**దిలావర్‌పూర్, మే 1, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ నర్సరీని ఏపీవో దివ్యారెడ్డి శుక్రవారం సందర్శించారు. మొక్కల అభివృద్ధి, సంరక్షణ చర్యలు, నీటి వసతులను పరిశీలించారు. ఎండల దృష్ట్యా మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రీన్ నెట్లతో కప్పి రక్షణ కల్పించాలని సిబ్బందికి సూచించారు. నర్సరీ నిర్వహణలో నాణ్యత పాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**హాజీపూర్, మే 1, ప్రభాతవార్త**

వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట, హాజీపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చే సమయంలో నిబంధన ప్రకారం మట్టి గడ్డలు, తప్ప, తేమ ఇతర నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేసిన తర్వాత ఆన్‌లైన్‌లో ట్రక్ షీట్ జనరేట్ చేయబడుతుందని, కొనుగోలు కేంద్రం, మిల్లుల టాగింగ్ ఆటోమేటిక్‌గా అవుతుందని, ధాన్యం లారీ పక్కదారి పట్టకుండా జిపిఎస్ పరికరం బిగించబడి ఉంటుందని తెలిపారు. రైతు వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును దృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం



వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచసి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేస్తుందని, క్వింటాల్ ఏ గ్రేడ్ రకానికి 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అదనంగా అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని రైతులు ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కార్మిక నాయకుడు జెట్టి శంకర్‌రావుకు

## రాష్ట్ర ప్రభుత్వ శ్రమ శక్తి అవార్డు

**(మొదటిపేజీ తరువాయి)**

శంకర్ రావు అంచెలంచెలుగా ఎదిగారు. పిట్ సెక్రటరీ నుండి కేంద్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ స్థాయి వరకు వివిధ బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఐఎన్టీయూసీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. కార్మిక చట్టాలు, వేతనాలు, సంక్షేమ అంశాలపై ఉన్న అవగాహనతో సింగరేణి సంస్థలో అనేక చర్చలకు ప్రతినిధిగా వ్యవహరించారు. కార్మిక సంక్షేమంతో పాటు సామాజిక సేవా రంగంలోనూ శంకర్ రావు తన ముద్ర వేశారు. నస్పూర్‌లో ఐఎన్టీయూసీ కార్యాలయ నిర్మాణం, యువత కోసం వ్యాయామశాల ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. 1995లో నస్పూర్ ఎంపీటీసీగా ఎన్నికై ప్రజాసేవ చేశారు. అప్రెంటిస్ విద్యార్థులకు శిక్షణ ఇస్తూ వారిని నైపుణ్యం కలిగిన టెక్నీషియన్లుగా తీర్చిదిద్దారు. నిరంతర కృషికి గుర్తింపుగా గతంలో సింగరేణి సంస్థ నుండి పలుమార్లు ఉత్తమ ఉద్యోగి ప్రశంసలు అందుకున్నారు. అవార్డు అందుకున్న అనంతరం శంకర్ రావు మాట్లాడుతూ ఈ గుర్తింపు తన బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు. తన ఎదుగుదలకు సహకరించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, డాక్టర్ సంజీవరెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు, మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. శంకర్ రావుకు అవార్డు దక్కడంపై ఐఎన్టీయూసీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్ భవేశ మిశ్రా

**(మొదటిపేజీ తరువాయి)**

తెలుసుకున్నారు. మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం హౌసింగ్ అధికారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు నాణ్యతతో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ, సంబంధిత యాప్‌లో ఫోటోలు నమోదు చేయాలని ఆదేశించారు. తద్వారా లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందేలా చూడాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు సక్రమంగా అందుతున్నాయో లేదో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శంకర్, తహశీల్దార్ ఎజాజ్ అహ్మద్, ఎంపీడీవో అరుణ, ఎంపీఓ గోవర్ధన్, సర్పంచ్ చైతన్య, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లో 700 దేశీ దారు బాటిళ్ల స్వాధీనం

**(మొదటిపేజీ తరువాయి)**

63 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోగా, దాని సుమారు మార్కెట్ విలువ .రూ. 25,200/..గా అంచనా వేశారు. ఈ ఘటనలో నిందితులుగా కాగజ్‌నగర్‌కు చెందిన రెడ్డి సాయి కుమార్,నీటూరి సురేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో నిందితులు మహారాష్ట్ర రాష్ట్రంలో తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి కాగజ్‌నగర్ ప్రాంతంలో అధిక ధరకు అక్రమంగా విక్రయించి లాభం పొందాలనే ఉద్దేశంతో తరలిస్తున్నట్లు వెల్లడైంది. ఈ కేసులో మద్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు. ఉన్నారు. ఈ ఆపరేషన్‌లో పోలీస్ సిబ్బంది పి. దుర్గా ప్రసాద్, డి. దీపక్ పాల్గొన్నారు. పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, అక్రమ మద్యం రవాణా లేదా విక్రయాలపై సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 ద్వారా తెలియజేయాలని సీఐ కోరారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తాం

**- మంచిర్యాల ఎమ్మెల్యే. ప్రేమ్‌సాగర్‌రావు**

**లక్షెట్టిపేట, మే 01, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎస్పీఆర్ ఫంక్షన్ హాల్‌లో దండేపల్లి, లక్షెట్టిపేట మండల, పట్టణానికి చెందిన 376 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, సంబంధిత అధికారులతో కలిసి అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని, సామాన్యుల సంక్షేమమే పరమావధిగా తమ పాలన సాగుతోందని పేర్కొన్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందని ఆయన వివరించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఎటువంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వ సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటామని, సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటామని, లబ్ధిదారులందరూ ఈ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి, జిల్లా అర్జీపిఆర్ ఎస్ అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్, జిల్లా ఆర్టీయే మెంబెర్ అంకతి శ్రీనివాస్ కౌన్సిలర్లు, చెల్ల నాగభూషణం, చింత అశోక్ కుమార్, సర్పంచులు, స్థానిక రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, పెద్ద ఎత్తున లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు

**బజార్‌హత్నూర్, మే 01, ప్రభాతవార్త:**

బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 141వ కార్మిక దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు కీర్తి వెంకటరమణ పతాకాన్ని ఆవిష్కరించి కార్మిక ఐక్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు రఘునాథ్, కార్యదర్శులు పిల్లి రాజు, పిట్ల రాములు, శ్యామ్ రావు, కాంగ్రెస్ మండల కన్వీనర్ పాండురంగ్, భూమయ్య, స్వామి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

**భైంసా, మే 01, ప్రభాతవార్త:**

దేశం ఏదైనా సమాజ గతిని నిర్దేశించేది శ్రామిక వర్గమేనని జనసేన పార్టీ నిర్మల్ జిల్లా నాయకులు సుంకేట మహేష్ బాబు అన్నారు. మేడే సందర్భంగా శుక్రవారం భైంసా పట్టణంలోని ఐలమ్మ గద్దె వద్ద జనసేన పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎర్ర జెండాను ఆవిష్కరించి, కార్మికులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం మహేష్ బాబు మాట్లాడుతూ.. మేడే అనేది అనేకమంది కార్మికుల ప్రాణత్యాగాల నుంచి పుట్టిన పోరాట దినమన్నారు. సఫాయి కార్మికులు, ఆటో కార్మికుల వంటి శ్రామిక శక్తి లేకపోతే సమాజానికి ప్రశాంతమైన జీవితం సిద్ధించదన్నారు. ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడం లేదని విమర్శించారు. హక్కుల సాధన కోసం కార్మికులు మరోసారి పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సుంకేట పోశెట్టి, శ్రీను, రాజు, అక్రమ్, భూమేష్, భోజన్న, దేవన్న, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్, మే 1, ప్రభాతవార్త :**

మేడే స్ఫూర్తితో కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్ రద్దుకు పోరాడుదామని పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి పిలుపునిచ్చారు. 140వ మేడే సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో సిపిఐ (ఎమ్ఎల్ ) న్యూడెమోక్రసీ, భారత కార్మిక సంఘాల సమాఖ్యల ఆధ్వర్యంలో పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఐఎఫ్టియు, సిపిఐ(ఎమ్ఎల్ ) న్యూడెమోక్రసీ నాయకులు రాపెల్లి రాజన్న, శ్రీనివాస్ లు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ శ్రమకు తగ్గ వేతనాలు, పని పరిస్థితుల మెరుగుదల, పనిగంటలను తగ్గింపులకై కార్మిక వర్గం పోరాడుతోందని గుర్తుచేశారు. 8 గంటల పని దినం కావాలని, కనీస వేతనం 30 వేల రూపాయలు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ పెట్టుబడి దారులకు కార్మికుల రక్తాన్ని ధారబోసే చట్టాలను చేస్తూ కార్మికులను బానిసలుగా మారుస్తున్నదని కేంద్రంపై మండిపడ్డారు. లేబర్ కోడ్స్ రద్దుకు పోరాటాన్ని ఉధృతం చేయండి అనే పిలుపుతో 140 వ మేడే సందర్భంగా ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి, మే 01, ప్రభాతవార్త**

మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే ను బెల్లంపల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. బీఆర్ అంబేద్కర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకునూరి రాజ్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గోగర్ల శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిలుక రాజనర్సు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే డే అనేది శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రతీకగా నిలిచిందని అన్నారు. కార్మిక హక్కుల కోసం జరిగిన వర్గపోరాటానికి మే డే ఒక శంఖారావమని, శ్రమజీవుల పండుగగా దీన్ని జరుపుకోవాలని పిలుపునిచ్చారు. 19వ శతాబ్దం చివర్లో కార్మికులు తీవ్ర దోపిడీకి గురై రోజుకు 14 నుంచి 16 గంటలు పని చేయాల్సి వచ్చేదని తెలిపారు. 1886 మే 1న అమెరికాలోని చికాగో నగరంలోని హేమార్కెట్ ప్రాంతంలో 8 గంటల పని దినం కోసం కార్మికులు భారీగా ఆందోళన చేపట్టారని, పోలీసుల కాల్పుల్లో అనేక మంది కార్మికులు అమరులయ్యారని గుర్తు చేశారు. వారి త్యాగాల ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా కార్మిక హక్కులు సాధించబడ్డాయని పేర్కొన్నారు. భారతదేశంలో కార్మిక ఉద్యమాలకు పునాది వేసిన నారాయణ మేఘాజీ లోకండే వంటి నాయకులు కార్మికుల హక్కుల కోసం పోరాడారని తెలిపారు. ఆదివారం సెలవు, మధ్యాహ్న విరామం వంటి హక్కులు వారి పోరాటాల ఫలితమేనని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ శ్రామిక వర్గ అభ్యున్నతికి చేసిన సేవలను గుర్తుచేస్తూ, ఆయన కార్మికులకు 8 గంటల పని దినం, ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్, మెడికల్ లీవ్, కార్మిక బీమా వంటి అనేక హక్కులను అందించారని వివరించారు. గనుల భద్రత, ఫ్యాక్టరీ చట్టాలు, మహిళలకు సమాన వేతనాలు, ప్రసూతి ప్రయోజనాలు వంటి అనేక కీలక చట్టాలను తీసుకువచ్చి కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారని అన్నారు. డా. బీఆర్ అంబేద్కర్ ప్రవేశపెట్టిన ఈ చట్టాలు కోట్లాది కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాయని, నేడు మనకు లభిస్తున్న హక్కులు ఆయన దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోళ్ల రమేష్, నియోజకవర్గ అధ్యక్షుడు కళ్లెపల్లి నవీన్, పట్టణ అధ్యక్షుడు ఎనగందుల శివాజీ, పట్టణ కోశాధికారి వేముల మల్లేష్, దాసరపు తిరుపతి, భోగే రాజయ్య, నాథరి భీమయ్య, రాసపెల్లి శంకర్, పల్లె రమేష్, ఆరేపెల్లి నరేష్, రామగిరి రాయలింగు, ఎల్కాపెల్లి మహేష్, బేజాల సంపత్, పులిపాక రామకృష్ణ, రామగిరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి, మే 01, ప్రభాతవార్త**

మేడే స్ఫూర్తితో ఉద్యమిదాం కార్మికుల హక్కులను కాలరాస్తున్న పాలక ప్రభుత్వాలకు బుద్ధి చెప్పుదాం.. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలను గద్దె దించుదాం అంటూ ఎంసీపీఐ(యు) పార్టీ జిల్లా కార్యదర్శి, ఏఐసిటియు రాష్ట్ర నాయకులు సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ ఘాటైన పిలుపునిచ్చారు. 141వ మే డే సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గంలోని నెన్నెల, కన్నెపల్లి, తాండూర్, బెల్లంపల్లి మండలాలతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎంసీపీఐ(యు) పార్టీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణలు ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి పట్టణంలోని మార్కెట్ ఏరియాలో పార్టీ జెండా ఎగురవేయగా, కన్నాల కొత్త బస్టాండ్ చౌరస్తాలో ఉన్న పార్టీ అమరవీరుల స్థూపం వద్ద, పార్టీ కార్యాలయంలో, అలాగే కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో కూడా జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 1886లో చికాగో నగరంలో జరిగిన కార్మిక ఉద్యమాలు ప్రపంచ కార్మిక వర్గానికి మార్గదర్శకంగా నిలిచాయని గుర్తు చేశారు. ఆ పోరాటాల స్ఫూర్తితోనే నేటి కార్మిక హక్కులు సాధ్యమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం దేశంలో కార్మిక చట్టాలను బలహీనపరుస్తూ, పరిశ్రమలను మూసివేస్తూ, ప్రజా రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలకే పాలకులు పనిచేస్తున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ముఖ్యంగా నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలపై మండిపడుతూ, దేశ సంపదను కొద్ది మంది కార్పొరేట్ శక్తులైన గౌతమ్ ఆదాని, ముకేశ్ అంబానీ చేతుల్లోకి అప్పగిస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. కార్మికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక పాలనను తట్టుకోలేం. కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉద్యమించి కష్టజీవుల రాజ్యాన్ని సాధించాలి అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంసీపీఐ(యు) పార్టీ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, అచల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఏఐఎఫ్డిడబ్ల్యు) జిల్లా అధ్యక్షురాలు దుర్గ లక్ష్మి, కార్యదర్శి కామెర పద్మ పాల్గొని జెండాలను ఎగురవేశారు. అలాగే పార్టీ నాయకులు మహేష్, రాజశేఖర్, మల్లేష్, సతీష్, రాజ సులోచన, రాధ, అమర్త్య, రామకృష్ణ, దుర్గం రాజేశ్వరి, దుర్గం గంగక్క, జుమిడి రాజ్‌కుమార్, ధర్మయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి, మే 01, ప్రభాతవార్త**

బెల్లంపల్లిలోని సింగరేణి గని కార్మిక సంఘం కార్యాలయం కార్మిక జెండాలతో ఎర్రగా ముస్తాబై, 140వ మే డే వేడుకలు ఉత్సాహభరితంగా, పోరాట స్ఫూర్తితో ఘనంగా నిర్వహించబడ్డాయి. సంఘం రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్ చేతుల మీదుగా మే డే జెండా ఆవిష్కరణ జరగగా, కార్మికుల ఐక్యత జిందాబాద్ నినాదాలతో ప్రాంతం మార్మోగింది. జెండా


ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

ఆవిష్కరణ అనంతరం కార్మిక హక్కుల కోసం ప్రాణాలు అర్పించిన చికాగోమృత అమరవీరులకు ఘన నివాళులర్పిస్తూ ఒక నిమిషం మౌనం పాటించారు. ఈ సందర్భంగా కార్మికుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి పోరాట చరిత్రను గుర్తుచేసుకున్నారు. అనంతరం నవోదయ సాంస్కృతిక కళాకారుల బృందం విప్లవ గీతాలతో సభను ఉర్రూతలూగించింది. కార్మిక చైతన్యాన్ని రగిలించే పాటలు, నృత్యాలతో కార్యక్రమం మరింత ఉత్సాహాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా మాట్లాడిన సంఘం రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా అమలు చేయాలని చూస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను పూర్తిగా హరించే విధంగా ఉన్నాయని, 29 కార్మిక చట్టాలను ఒకేసారి బలహీనపరచడం అన్యాయం అని మండిపడ్డారు. 140వ మే డే సాక్షిగా చెబుతున్నాం. ఈ కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకునే వరకు మా పోరాటం ఆగదు. అవసరమైతే దేశవ్యాప్తంగా భారీ ఉద్యమాలు చేపడతాం అని స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. కార్మికులను బలహీనపరిచే విధానాలను ఏ ప్రభుత్వం తీసుకొచ్చినా సహించబోమని, కార్మిక ఐక్యతతో వాటిని తిప్పికొడతామని తెలిపారు. అలాగే కేరళ, పశ్చిమ బెంగాల్, కర్ణాటక రాష్ట్రాలలో ఈ లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కార్మికుల పక్షాన నిలబడి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్మికుల చెమటతో దేశం నడుస్తుంది. వారి హక్కులను కాపాడటం ప్రభుత్వాల బాధ్యత అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ నాయకులు ఎన్నం శంకర్ పాల్గొని, కార్మికుల ఐక్యతే విజయం సాధించే మార్గమని పిలుపునిచ్చారు. నవోదయ సాంస్కృతిక కళాకారులు రాజ్ కిరణ్, టీ. మల్లేష్, రమేష్, విలాస్, ఆనంద్, విజయ్ కుమార్, సునీత, సంగీత, కన్నూరి సమ్మయ్య, లక్ష్ముుుుణ్ తదితరులు తమ గీతాలు, నృత్యాలతో కార్మికులలో చైతన్యం నింపారు.




జెండాను ఆవిష్కరణలో పిడిఎస్యు కొమురంభీం జిల్లా నాయకులు








## పరీక్ష తప్పాననే మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య



**లక్షెట్టిపేట, మే 1, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మండలం చందారంలో ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిన అర్సే మాధవి (17) అనే విద్యార్థిని శుక్రవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులు లేని ఈ విద్యార్థిని అమ్మమ్మ వద్ద ఉంటూ చదువుకుంటోంది. ఫలితాలు వెలువడినప్పటి నుండి తీవ్ర దిగులుతో ఉన్న ఆమె ప్రాణాలు తీసుకుందని ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. పోలీసులు తెలిపే వివరాల ప్రకారం, మృతురాలి అక్క హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తోంది. శుక్రవారం ఆమె చెల్లెలికి ఇంటి సరుకులు కొని ఇచ్చి పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మాధవి లోపలి నుండి గడియ పెట్టుకొని చున్నీతో వాసానికి ఉరివేసుకుంది. అమ్మమ్మ బయట నుండి వచ్చి ఎంత పిలిచినా పలకకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా విగతజీవిగా కనిపించింది. బంధువుల ప్రోత్సాహంతో ఇంటర్ వరకు చదువుకున్న మాధవి పరీక్ష తప్పడంతో తీవ్ర వేదనకు గురైంది. ఇంట్లో వాళ్ళు ధైర్యం చెప్పినా ఆ దిగులు నుండి బయటపడలేకపోయింది. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. చిన్న వయసులోనే విద్యార్థిని ప్రాణాలు తీసుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

**దండేపల్లి, మే 1, ప్రభాతవార్త**

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. శుక్రవారం ఎస్ఆర్‌పి ఫంక్షన్ హాల్లో దండేపల్లి, మండలానికి సంబంధించిన షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను స్థానిక నాయకులు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు దండేపల్లి మండలంలోని కన్నెపల్లి గ్రామంలోని వారి సర్పంచ్ చుంచు నగేష్,ఉప సర్పంచ్ ముక్తి శంకరయ్య, మాజీ ఎంపీటీసీ,తోట మోహన్, కార్యకర్తలు ముత్తె మహేష్,తోట మహేష్, భీమేష్,కొట్టే రాజన్న, లబ్ధిదారులు సత్యవ్వ, బోరి లక్ష్మి, కట్ల సరిత,వేల్పుల జ్యోతి, వీరికి కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేయడం జరిగింది.

## ఆసిఫాబాద్ డిఎఫ్ఓకు ఘనంగా వీడ్కోలు

**ఆసిఫాబాద్ టౌన్, మే 1, ప్రభాతవార్త :**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో అంకితభావంతో సేవలందించి బదిలీపై వెళ్తున్న జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ కు జిల్లా ప్రజా ప్రతినిధులు ఘనంగా వీడ్కోలు నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న డిఎఫ్ఒను ఎమ్మెల్యే లు కోవాలక్ష్మి, హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండే విట్టల్ లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులకు విధుల్లో భాగంగా బదిలీలు సాధారణమని పేర్కొన్నారు. కుమురం భీం జిల్లాలో పనిచేసిన మాదిరిగానే ఎక్కడ పనిచేసినా మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్డిఒ అప్పయ్య, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

# పిల్లల మెరుగైన జీవన విధానానికి ప్రభుత్వం కృషి

*** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**నస్పూర్, మే 1, ప్రభాతవార్త**

జాతీయ ఆరోగ్య మిషన్ కింద రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా పిల్లలలో ఏర్పడే జన్యుపరమైన లోపాలు, వ్యాధులు, ఎదుగుదల అంశాలలో ఎదురయ్యే సమస్యలన పరిష్కరించి మెరుగైన జీవన విధానం అందించేందుకు ప్రభుత్వం చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏర్పాటుచేసిన బాల భరోసా కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు వేద వ్యాస్, ఆర్ఎంఒ శ్రీధర్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పుట్టినప్పటి నుండి 18 సంవత్సరాల వరకు పిల్లలతో ఏర్పడే జన్యుపరమైన లోపాలు, వ్యాధులు, ఎదుగుదల లోపాలను అధిగమించి పిల్లలకు మెరుగైన జీవన విధానం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పిల్లలలో వ్యాధులను నియంత్రణ దిశగా వ్యాక్సినేషన్ అందించేందుకు ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ లోపం ఉన్న వారిని గుర్తించి సరైన వైద్య చికిత్స, పౌష్టికాహారం అందించడం ద్వారా సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంగన్వాడి కేంద్రం నుండి పాఠశాల స్థాయి వరకు విద్యార్థుల ఎదుగుదలపై పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా మహిళ, శిశు ప్రత్యేక వారం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం ద్వారా మహిళలు, పిల్లలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని 974 అంగన్వాడీ కేంద్రాలలో ఆర్‌బిఎస్‌కే వైద్య బృందాలు పర్యటించి సుమారు 38 వేల 700 మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించి, ఇందులో 21 మంది పిల్లలను గుర్తించి వారికి సూపర్ స్పెషాలిటీ వైద్యులచే వైద్యం అందించడం జరుగుతుందని, 14 సంవత్సరములు నిండిన బాలికలకు హెచ్‌పివి వ్యాక్సినేషన్ ఇప్పించడం ద్వారా క్యాన్సర్‌ను రాకుండా నియంత్రించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సిడిపిఓలు, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు, ఆర్ బి ఎస్ కే వైద్యులు, బాలల సంరక్షణ విభాగం అధికారి ఆనంద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాలినడకన అయోధ్యకు చేరుకున్న నవీన్

**తాండూర్, మే 1, ప్రభాతవార్త :**




తాండూర్ మండలంలోని చౌటపల్లి గ్రామం నుంచి చీమల నవీన్ కుమార్ అనే హనుమాన్ స్వామి కాలినడకన బయలుదేరి శుక్రవారం అయోధ్య కు చేరుకున్నాడు. మార్చి 10న నవీన్ కుమార్ హనుమాన్ మాల ధరించాడు. మరుసటి రోజు మార్చి 11న చౌటపల్లి నుంచి పాదయాత్ర ప్రారంభించి అయోధ్యకు బయలుదేరాడు. మొత్తం 52 రోజుల పాటు నిరంతరం సుమారు 1050 కిలోమీటర్లు పాదయాత్ర చేసి అయోధ్యలోని రామ మందిరం చేరుకున్నాడు. బాల రాముడిని దర్శనం చేసుకుని పాదయాత్ర విజయవంతంగా పూర్తి చేశానని ఆయన తెలిపారు.



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**చెన్నూరు, మే 1, ప్రభాతవార్త**

చెన్నూరు మండలంలోని కత్తరసాల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవో అధ్యక్షురాలు పాల్నే శారద సింగన వేణి గట్టక్క దేవసేనా రజిత మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సన్న వడ్లకు ప్రభుత్వం బోనస్ అందిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



తమ గురువులను సన్మానిస్తున్న 2003-04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు.

## వడ్యాల్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**లక్ష్మణచందా, మే 01, ప్రభాతవార్త:**

మండలంలోని వడ్యాల్ గ్రామ ఉన్నత పాఠశాలలో 2003-2004 విద్యా సంవత్సరానికి చెందిన పదవ తరగతి విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 22 ఏళ్ల తర్వాత ఒకరిని ఒకరు కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల రోజుల్లో గడిపిన క్షణాలు, తరగతి గది అల్లరి గురించి గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. వివిధ రంగాల్లో స్థిరపడిన మిత్రులను చూసి అందరూ సంతోషం వ్యక్తం చేశారు. స్నేహబంధం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**ఆసిఫాబాద్, మే 1, ప్రభాతవార్త:**

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల దృష్ట్యా, ప్రశాంత వాతావరణ పరిస్థితులను సవ్యంగా కొనసాగించడానికి మే 1 నుండి 31 వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ నితిక పంత్ బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. 30 పోలీస్ యాక్ట్1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి, ఎస్పీ ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదన్నారు. చట్టపరమైన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం శిక్షార్హులు అవుతారని సూచించారు.


బుద్ధ విగ్రహానికి పుష్పమాలలు సమర్పించిన కోనేరు కోనప్ప రమాదేవి


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన సొసైటి సభ్యులు

# ఘనంగా భగవాన్ బుద్ధుని జయంతి వేడుకలు

**సిర్పూర్ (టి), మే 1,ప్రభాతవార్త :**

సిర్పూర్ మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో బుద్ధ విగ్రహ ప్రాంగణంలో భగవాన్ బుద్ధుని 2570వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో సిర్పూర్ మాజీ శాసనసభ్యులు కోనేరు కోనప్ప రమాదేవి దంపతులు పాల్గొని బుద్ధుని విగ్రహానికి పుష్పమాలలు సమర్పించి వారిని స్మరించుకున్నారు. అనంతరం కోనేరు కోనప్ప గారు మాట్లాడుతూ..భగవాన్ బుద్ధుడు ప్రపంచానికి శాంతి, అహింస, సత్యం, ధర్మం అనే గొప్ప మార్గాన్ని చూపించిన మహానుభావుడని తెలిపారు. బుద్ధుని బోధనలు నేటి సమాజంలో మరింత అవసరమని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గాన్ని అనుసరించి సమాజంలో శాంతి, సౌహార్దతను పెంపొందించాలని బుద్ధుని ఆలోచనలు మానవత్వానికి దిక్సూచి వంటివని పేర్కొన్నారు. యువత మంచి విలువలను అలవరుచుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు దుర్గం విక్రమ్ దుర్గం తిరుపతి దేవాజి ప్రభాకర్ స్థానిక నాయకులు కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బుద్ధుని జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

**కాగజ్‌నగర్ రూరల్, మే 1, ప్రభాతవార్త :**

సమస్త మానవాళికి శాంతి మార్గాన్ని అందించిన ఆశా జ్యోతి తథాగత గౌతమ బుద్ధుని 2570వ జయంతి సందర్భంగా బుద్ధ పూర్ణిమ వేడుకలు స్థానిక మీరాతాయి అంబేద్కర్ దీక్ష భూమిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ది బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, సమత సొసైటీ కాగజ్‌నగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యులు డాక్టర్ సునీత రావుజి మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి, కరుణ, అహింస, సమానత్వం అనే అమూల్యమైన మార్గాన్ని చూపిన తథాగత గౌతమ బుద్ధుడు మన జీవితాలకు శాశ్వత దీపస్తంభమని పేర్కొన్నారు. అనంతరం ది బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం విస్తారు మాట్లాడుతూ మనసును జయించడం ద్వారా ప్రపంచాన్ని మార్చవచ్చని బోధించిన మహాముని మనకు ఆదర్శనీయుడు" అని అన్నారు. మనలోని కోపం, ద్వేషాన్ని విడిచిపెట్టి ప్రేమ, సహనం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమతా సొసైటీ ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి, ది బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కార్యకర్తలు మోహన్ దుర్గే, విశ్వాస్ జగతాప్, కొండ గొర్ల గణపతి, సంతోష్ దేవ్గడె, శ్యామ్ రావుజాడే, అనిల్ దుర్గే, రమేష్ డోంగ్రే, గజానంద్ డోంగ్రే, సుఖదేవ్ జాడే, హరీష్, ఆత్మరామ్, పండరీనాథ్, ప్రభాకర్ జాడే, జ్ఞానేశ్వర్ డోంగ్రే, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**నార్నూర్, మే 01, ప్రభాతవార్త:**

ప్రపంచానికి శాంతి, అహింస సందేశాన్ని అందించిన గౌతమ బుద్ధుని జయంతిని మండల కేంద్రంలోని త్రిరత్న బుద్ధ విహార్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై బుద్ధుడి విగ్రహానికి పుష్పార్పణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ వంశంలో జన్మించినా సత్యాన్వేషణ కోసం సర్వాన్ని త్యజించిన గొప్ప తత్వవేత్త బుద్ధుడని కొనియాడారు. ఆయన బోధనలు నేటి సమాజానికి ఎంతో ఆవశ్యకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బ్రిజు లాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేష్ ఆడే, బీజేపీ మండల అధ్యక్షుడు బిక్షపతి, హనుమంతరావు, మహేందర్, బాలాజీ కాంబ్లె, ప్రకాష్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.


బుద్ధపూర్ణిమ వేడుకల్లో పాల్గొన్న సొసైటి సభ్యులు


బుద్ధుడి విగ్రహానికి పుష్పార్పణ చేస్తున్న సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి గజానంద్ నాయక్

## కొత్తపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా: డా. ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**బజార్‌హత్నూర్, మే 01, ప్రభాతవార్త:**

బజార్‌హత్నూర్ మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన కొత్తపల్లిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే డా. అనిల్ జాదవ్ హామీ ఇచ్చారు. శుక్రవారం గుడ్ మార్నింగ్ బోథ్ కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామంలో పర్యటించారు. ముందుగా మోడల్ స్కూల్ నుండి కాలినడకన వెళ్లి, వాగుపై బ్రిడ్జి లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణంతో పాటు, నిలిచిపోయిన రోడ్డు పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మండలంలోని డెడ్రా, మాన్కాపూర్ గ్రామాలకు కూడా రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం రాంపూర్ గ్రామాన్ని సందర్శించగా, కేసీఆర్ హయాంలో వచ్చిన మిషన్ భగీరథ నీరే తమకు వరమని గ్రామస్థులు కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ పాలనలోనే పల్లెలు కళకళలాడాయని, ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని విమర్శించారు. ఇదే క్రమంలో వినాయక్ రావు, గోవింద్ రావు సహా పలువురు మహిళలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి. ప్రియాంక భీమేష్, ఉపసర్పంచ్ రాజేందర్, మండల యువజన సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు మురళీకృష్ణ, తరుణ్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



## నర్సాపూర్‌లో కన్నుల పండుగగా లక్ష్మీనరసింహ కల్యాణం

**నర్సాపూర్(జి), 01 మే, ప్రభాతవార్త:**

వైశాఖ శుద్ధ పౌర్ణిమ శ్రీ లక్ష్మీనరసింహ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నర్సాపూర్ గ్రామంలో స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. చాట్ల దామోదర్ నర్సవ్వ దంపతులు, వారి కుమార్తె అల్లుడు శ్రీమతి విజయ గంగాకిషన్ దంపతుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం వేద పండితులు పుణ్యహవాచనం, విశేష అభిషేక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ ఘట్టాన్ని భక్తుల జయజయధ్వానాల మధ్య వైభవంగా పూర్తి చేశారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



## తేజాపూర్‌లో రామాలయ నిర్మాణానికి భూమి పూజ

**నేరడిగొండ, మే 1, ప్రభాతవార్త:**

మండలంలోని తేజాపూర్ గ్రామంలో రామాలయ నిర్మాణానికి శుక్రవారం ఘనంగా భూమి పూజ చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనేలా ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పవిత్రమైన ఈ వేడుకలో తేజాపూర్ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.


తేజాపూర్ గ్రామంలో రామాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వేద పండితులు, గ్రామస్థులు

## కలెక్టర్ భవిష్ మిశ్రాను కలిసిన ఎమ్మెల్యే రామారావు పటేల్

**నిర్మల్, మే 01, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భవిష్ మిశ్రాను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, లారీల కొరత వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రవాణా సౌకర్యాలను మెరుగుపరచి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తు తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



విద్యార్థులను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

## పదో తరగతి విద్యార్థులకు వీడీసీ ఆధ్వర్యంలో సన్మానం

**భైంసా, మే 01, ప్రభాతవార్త**

భైంసా మండలం దేగం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గ్రామ తాత్కాలిక వీడీసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పాఠశాలలో కనకపూర్ నందిని 524 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, 523 మార్కులతో గాడోళ్ల అలేఖ్య ద్వితీయ స్థానం సాధించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ గంగాధరోళ్ల లక్ష్మణ్, సభ్యులు సున్నపు లక్ష్మణ్, గాడోళ్ల నరేష్, బొగ్గుల మహేష్, కొండల్వార్ కిస్తన్న, సున్నపు సాయిలు, పాతర్ల నాగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మరింత పట్టుదలతో చదివి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉన్నత చదువుల్లోనూ రాణించి జిల్లాలోనే ఉత్తమ గుర్తింపు పొందాలని కోరుతూ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీఓ అజీజ్ ఖాన్

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం చేయించిన ఎంపీఓ

**సారంగాపూర్, మే 01, ప్రభాతవార్త:**

మండలంలోని నాగపూర్ గ్రామపంచాయతీలో శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా లబ్ధిదారులు ఇందిరమ్మ నూతన గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీఓ అజీజ్ ఖాన్ హాజరై లబ్ధిదారుల చేత గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన అవకాశంతో ఇంటిని పూర్తి చేసుకున్న లబ్ధిదారులను అభినందించారు. గృహప్రవేశానికి విచ్చేసిన అధికారులకు లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ లలితా బాయి, హౌసింగ్ ఏఈ నాగార్జున, పంచాయతీ కార్యదర్శి గోపికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## దగ్ధమైన మొక్కజొన్న పంటను పరిశీలించిన అధికారులు

**సారంగాపూర్, మే 01, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన మొక్కజొన్న పంటను శుక్రవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు సాదు గంగారెడ్డి సాగు చేస్తున్న పంట గురువారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఆర్ఐ వెంకటరమణ, జిపిఓ ప్రవళిక క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ.. పంట నష్టం వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రైతుకు న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సర్పంచ్ బల్గూరి అజయ్, ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలి

### – మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

**నస్పూర్, మే 1, ప్రభాతవార్త**




విద్యార్థి దశ నుండి విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకొని నూతన ఆవిష్కరణ దిశగా తమ మేధస్సును పెంపొందించుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని జిల్లా సైన్స్ కేంద్రంలో జిజ్ఞాస ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేసవి సైన్స్ శిబిరాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్‌లతో కలిసి సందర్శించి ప్రయోగాల బోధన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి సైన్స్ రంగంలో నూతన ఆవిష్కరణల దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని తెలిపారు. జిల్లాలో నిర్వహిస్తున్న వేసవి సైన్స్ శిబిరం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైనదని, సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవడానికి దోహదపడుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో అపారమైన అనుభవం ఉన్న ఉపాధ్యాయులు పని చేస్తున్నారని, జిల్లా సైన్స్ ఆక్టివిటీస్ లో రాష్ట్రంలోనే మంచి పేరుతో ఉందని, దేశ వ్యాప్తంగా అనేక కార్యక్రమాల్లో జిల్లా విద్యార్థులు పాల్గొన్నారని, ఈ అభివృద్ధిలో జిల్లా విద్యాశాఖ, సైన్స్ కేంద్రం కృషి అభినందనీయమని తెలిపారు. జిల్లా సైన్స్ కేంద్రం ఆధ్వర్యంలో జిజ్ఞాస మొబైల్ వ్యాన్ ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాలలలో ప్రయోగాలు నిర్వహిస్తూ విద్యా సంవత్సరం మొత్తం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వేసవి సెలవులలో విద్యార్థులు సమయం వృధా చేయకుండా సైన్స్ పట్ల, సైన్స్ ప్రయోగాల పట్ల అవగాహన ఏర్పరచుకొని, నూతన ఆవిష్కరణల దిశగా వెళ్లేందుకు ఈ శిబిరం ఉపయోగపడుతుందని, ఉపాధ్యాయులు కృత్యాధార పద్ధతి ద్వారా సైన్స్ పట్ల అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు చేసిన పలు ప్రయోగాలను ఆసక్తిగా గమనించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, కొప్పుల తిరుపతి, రాజేశం, శ్రీ మూర్తి, శ్రీనివాస్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న షీటీం సిబ్బంది

## మహిళల భద్రతపై షీ టీమ్ ప్రత్యేక చైతన్యం

### - బి.ఎన్.ఎస్ చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన

**కాగజ్‌నగర్,మే 1, ప్రభాతవార్త :**

ప్రజా పాలన – ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నీతిక పంత్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ పట్టణంలోని మధుర హాస్పిటల్‌తో పాటు కాగజ్‌నగర్ రూరల్ పరిధిలోని శివపురం, ఇస్గావ్ గ్రామాల్లో షీ టీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీ టీమ్ ఇన్చార్జి సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నపిల్లల భద్రతపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొత్త చట్టాలైన బి.ఎన్.ఎస్ గురించి వివరించి, మహిళల భద్రత, చిన్నపిల్లల రక్షణ, లింగ సమానత్వం, సైబర్ నేరాలు, బాల్య వివాహాల నివారణ వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీస్ సహాయం పొందేందుకు డయల్ 100, 112 సేవలతో పాటు 1930 (సైబర్ మోసాల హెల్ప్‌లైన్), 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్) నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. నాచగిరి, గ్రామస్తులు, షీ టీమ్ సిబ్బంది రమాదేవి, శ్రీనివాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.

## నేడు సిర్పూర్ నియోజకవర్గ స్థాయి సభ

**కాగజ్‌నగర్,మే 1, ప్రభాతవార్త :**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా సిర్పూర్ నియోజకవర్గ స్థాయి సభను ఈ నెల 2వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు ఎస్‌పీఎం క్లబ్‌లో నిర్వహించనున్నట్లు కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా శుక్రవారం పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన సంక్షేమ పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, గృహ జ్యోతి, సన్నరకం వరి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి (బ్యాంకు లింకేజీ టు స్వయం సహాయక సంఘాలు), వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డులపై సమగ్రంగా చర్చించనున్నారు. కావున ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, అలాగే ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సబ్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడుదాం

### - ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిత

**నర్సాపూర్(జి), 01 మే ప్రభాతవార్త:**



చికాగో అమరవీరుల స్ఫూర్తితో కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి హరిత పిలుపునిచ్చారు. 140వ మే డే సందర్భంగా నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయం భగత్ సింగ్ భవన్ ముందు ఆమె ధ్వజారోహణ చేశారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ.. 1886లో చికాగో కార్మికులు 8 గంటల పనిదినం కోసం చేసిన పోరాటం, వారి బలిదానాలు చరిత్రలో నిలిచిపోయాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మికులు బానిసలుగా మారుతున్నారని, పని గంటలను 12 గంటలకు పెంచడం అన్యాయమని పేర్కొన్నారు. కనీస వేతనం రూ. 30 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు కొమ్ముకాసే చట్టాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్ లక్ష్మణ్, బక్కన్న, ఆనంద్, దత్తురాం, గపూర్, శ్రీను, పోశెట్టి, అన్వర్ పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం

**వేమనపల్లి, మే 01, ప్రభాతవార్త**

పోలీస్ ఉద్యోగంలో గత 35 సంవత్సరాలు అంకితభావంతో పని చేసి అందరి మన్ననలు పొంది ఉద్యోగ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ బండి రాజయ్యను చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ, నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి శుక్రవారం సన్మానించారు. నీల్వాయి పోలీస్ స్టేషన్ లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి వారిని శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. రాజయ్య క్రమశిక్షణతో, స్నేహపూర్వకంగా మెదిలి అందరి మన్ననలను పొందారనిన్నారు. పదవీ విరమణ అనేది అనివార్యమని, ప్రతి ఒక్కరూ పదవీ విరమణ పొందుతారని, వారి భావి జీవితం సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





ప్రాణహితనదిపై బరాజ్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

# ప్రాణహిత నదిపై బరాజ్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**కౌటాల, మే1, ప్రభాతవార్త:**

కౌటాల మండలంలోని తుమ్మిడి హెట్టి గ్రామం వద్ద ప్రాణహితనది పై బరాజ్ నిర్మాణ ప్రాంతాన్ని ఎస్పీ నితికా పంత్, ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం కలెక్టర్ కె హరిత పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో బరాజ్ నిర్మాణం ద్వారా ఎన్ని టిఎంసిల నీరు లభ్యమవుతుందని, అలాగే ఎన్ని ఎకరాలకు సాగు నీరు అందించవచ్చుని, ఎన్ని ఎకరాల భూమి ముంపుకు గురవుతుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో రాష్ట ముఖ్య మంత్రి , నీటి పారుదల శాఖ మంత్రి , ఇతర మంత్రులు, నీటి పారుదల శాఖ ఉన్నత అధికారులు, నిపుణులు బరాజ్ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించనున్నారని ఆ దిశగా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమములో కాగజ్ నగర్ డిఎస్పీ వహిదుద్దిన్, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటి చైర్మన్ సుద్దాల దేవయ్య, తహసిల్దార్ ప్రమోద్, ఎంపిడివో ప్రసాద్, నీటిపారుదల శాఖ అధికారులు, స్థానికులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు మొక్కజొన్నలను మార్క్‌ఫెడ్ కు విక్రయించడంతో

# మద్దతు ధరను పొందవచ్చు

● కలెక్టర్ కె హరిత

**కౌటాల, మే1, ప్రభాతవార్త:**



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

రైతులు పండించిన మొక్కజొన్నలను మార్క్ ఫెడ్ కు విక్రయించడం ద్వారా ప్రభ్నుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందవచ్చని కలెక్టర్ హరిత అన్నారు. శుక్రవారం కౌటాల మండల కేంద్రంలోని వ్యవసాయ గిడ్డంగి ఆవరణలో తెలంగాణ రాష్ట మార్క్ ఫెడ్ వారి ఆద్వర్యంలో ప్రాథమిక సహకార సంఘం గురుడు పేట ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, సిర్పూర్ శాసన సభ్యులు పాల్వాయి హరీష్ బాబు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ హరిత ప్రారంబించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యాసంగి సీజన్‌లో ఎక్కువ మంది రైతులు మొక్క జొన్న పంటను సాగు చేశారన్నారు. రైతులు తాము పండించిన మొక్క జొన్న పంటను మార్కెట్ ఫెడ్ కు విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ ప్రభుత్వం మొక్క జొన్న పంటని మర్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుందని రైతులు తాము పండించిన పంటలను దళారులకు విక్రయించ కుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని అన్నారు. సిర్పూర్ శాసన సభ్యులు పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం కౌటాల మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగకరంగా వుందని తెలిపారు. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో రైతులు మొక్క జొన్న పంటలను సాగు చేశారని రైతులు తాము పండించిన మొక్క జొన్న పంటను మార్క్ ఫెడ్ కు విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. అ్ననతరం మండలంలోని సాండ్‌గాం గ్రామంలో సెర్ఫ్ అద్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి వరి ధాన్యము కొనుగోలు కేంద్రాన్నిఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ , సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డెవిడ్‌తో కలిసి కలెక్టర్ హరిత ప్రారంబించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. సన్న రకం వరి ధాన్యం క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమములో కాగజ్ నగర్ మార్కెట్ కమిటి చైర్మన్ సుద్దాల దేవయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్, సర్పంచులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం: ఎస్ఐ

**నస్పూర్, మే 1, ప్రభాతవార్త**

మహిళల రక్షణే ప్రధాన ధ్యేయంగా షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, ప్రతి ఒక్కరూ వీటి పనితీరుపై అవగాహన కలిగి ఉండాలని మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ ఉషారాణి పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల డిసిపి భాస్కర్ పర్యవేక్షణలో శుక్రవారం నస్పూర్ కాలనీ, షిర్కే ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు నిర్భయంగా ప్రయాణించే వాతావరణాన్ని కల్పించడంలో ఆటో డ్రైవర్ల పాత్ర కీలకమని ఈ సందర్భంగా ఆమె వివరించారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ఎస్ఐ సూచించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు మహిళలను ఇబ్బంది పెడుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని కోరారు. మహిళలు వేధింపులకు గురైతే మౌనంగా ఉండకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా మోసాలకు గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం డయల్ 100 లేదా షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 6303923700ను సంప్రదించాలని అధికారులు సూచించారు. సైబర్ నేరాలకు గురైన వారు 1930 హెల్ప్‌లైన్ నంబర్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ కానిస్టేబుళ్లు సతీష్, జ్యోతి, ఆటో యూనియన్ అధ్యక్షుడు జగదీశ్, ఉపాధ్యక్షుడు సతీష్, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



# అడవ్యల సంరక్షణ అందరి బాధ్యత

**- గిన్నేధరి ఎఫ్ఆర్‌వో సరోజరాణి**

**తిర్యాని, మే1, ప్రభాతవార్త:**



అడవులను, వన్య సంపదను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గిన్నెదరి ఫారెస్ట్ రేంజ్ అధికారిణి సరోజరాణి పిలుపునిచ్చారు. శుక్రవారం గిరిజనులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమే మాట్లాడారు. వంట కోసం అడవిలో చెట్లను నరికి వంట చెరుకుగా వాడటం వల్ల పర్యావరణానికి హాని జరుగుతోందన్నారు. కాబట్టి అందరూ ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లు తీసుకోవాలని సూచించారు. అర్హులైన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు, సిలిండర్లు పంపిణీ చేస్తున్నామన్నారు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమే కోరారు. ఈ కార్యక్రమంలో అటవిశాఖ సిబ్బంది, గిరిజనలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించాలి

**ఆసిఫాబాద్, మే 1, ప్రభాతవార్త :**



విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ హరిత పేర్కొన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేటలోని కలెక్టర్ ఛాంబర్లో విద్యుత్ వినియోగంలో భద్రతను అవగాహన పెంపొందించేందుకు మే 1నుంచి 7 వరకు టీడీఎస్‌పీడీసీఎల్ ఆసిఫాబాద సర్కిల్ పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమంకు సంబంధించి గోడప్రతులను డిఆర్ఓ లోకేశ్వర్ రావు, విద్యుత్ శాఖ ఎస్ఈ జాడే ఉత్తమ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ అధికారులు వినియోగదారులకు, రైతులకు విద్యుత్ భద్రతపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగంలో నిరక్ష్యం, అజాగ్రత్త, అలసత్వం కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటి నివారణకు సేఫ్టీ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజలు జాగ్రత్తలు పాటించి, ఎలాంటి ప్రమాద సూచనలు గమనించిన వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వాలని, 24/7 టోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా ఫోన్ చేసి విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు ఫిరోజ్ ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.